

గుడ్స్‌షెడ్డులోని హనుమాన్ దేవాలయం

## హనుమాన్ జయంతికి ఆలయాలు ముస్తాబు

**మోతీనగర్:** కబీర్‌నగర్‌లో శ్రీశివరామాంజనే దేవాలయంలోని ఆంజనేయస్వామి 75 ఏళ్లుగా పూజలందుకుంటున్నారని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఈనెల 23వ తేదీన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 6గంటలకు అభిషేకం, 9.30 గంటలకు 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం, 12.30 గంటలకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ పూజల్లో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. పర్వత్‌నగర్‌లోని పర్వత వర్ధిని సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు ఉంటాయని తెలిపారు. ఉదయం 7 గంటలకు అభయాంజనేయస్వామి వారికి పంచామృతాభిషేకం, విశేష సింధూర పూజలు, తమలపాకుల అర్చన, హారతి, తీర్థప్రసాద వితరణ ఉంటుందన్నారు.

**నేడు భవ్య హనుమాన్ శోభాయాత్ర**

**మూసాపేట:** మూసాపేట జనతానగర్‌లోని హనుమాన్ దేవాలయంలో 23వ తేదీన హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం 5.30 గంటల నుంచి భవ్య హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు శ్రీరామ దండు సభ్యులు తెలిపారు. మూసాపేట జనతానగర్‌లోని భక్తాంజనేయస్వామి దేవాలయం నుంచి గూడ్స్‌షెడ్ రోడ్డులోని హనుమాన్ ఆలయం వరకు యాత్ర ఉంటుందన్నారు. అదేవిధంగా భరత్‌నగర్‌లోని హరిహర క్షేత్రంలోని ఆంజనేయస్వామి ఆలయం, గూడ్స్‌షెడ్ రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## వయోవృద్ధులను చిన్న పిల్లలుగా చూసుకోవాలి



వయోవృద్ధులకు సన్మానం కార్యక్రమంలో పెద్దల సమాఖ్య ప్రతినిధి డాక్టర్ ఎస్వీ ప్రసాద్

**మోతీనగర్:** వయో వృద్ధులకు వయసుతో నిమిత్తం లేకుండా మనసుతో ఎన్నో మంచి పనులు చేయవచ్చని మోతీనగర్ పెద్దల సమాఖ్య ప్రతినిధి డాక్టర్ ఎస్వీ ప్రసాద్ పేర్కొన్నారు. మూసాపేట డివిజన్ మోతీనగర్ కమ్యూనిటీహాల్‌లో సోమవారం సుమారు 200 వయోవృద్ధులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా సమాఖ్య ప్రతినిధి డాక్టర్ ఎస్వీ ప్రసాద్ మాట్లాడుతూ... 75 సంవత్సరాల నిండిన నూటికి ముగ్గురు, నలుగురు మాత్రమే ఆయుష్షు కలిగి ఉంటారని నివేదికలు చెబుతున్నాయని అన్నారు. ఎంసీహెచ్ఎస్ మాజీ అధ్యక్షుడు నల్లమలుపు అంజిరెడ్డి మాట్లాడుతూ... నేడు సమాజంలో వయోవృద్ధులైన తల్లిదండ్రులను చాలా మంది వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాల్లో చేరుస్తుండటం బాధాకరమని అన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఉంటే వారి ఆరోగ్యం, ఆయుష్షు మరింత పెరుగుతందని తెలిపారు. వృద్ధులను చిన్న పిల్లలుగా వారి బాగోగులను చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం డాక్టర్ ఎస్వీ ప్రసాద్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో బ్రహ్మానందారెడ్డి, రాధాకృష్ణ, కాలప్ప, సుబ్బరామయ్య, సీఎస్ఆర్ మూర్తి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## జేఎన్‌టీయూలో టెక్నికల్ ఫెస్ట్ షురూ



ఫెస్ట్‌లో ఓ విద్యార్థి ప్రాజెక్ట్

**బాలానగర్:** జేఎన్‌టీయూ యూనివర్సిటీలో రెండురోజుల సాంకేతిక ఉత్సవం–2024 ప్రారంభమయ్యింది. ఈ టెక్నికల్ ఫెస్ట్‌ను వీసీ ప్రొ. డా. కట్టా నరసింహారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు నాలుగు గోడల మధ్య నేర్చుకున్న విషయాలు ప్రపంచం దృష్టికి తీసుకెళ్లడమే టెక్నికల్ ఫెస్ట్ ఉద్దేశమన్నారు. సీనియర్ ప్రొ. విజయ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే కొత్త ఆలోచనలు చేసి ముందుకు వెళ్లాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. జీవీ నరసింహారెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ డా. వి.పద్మావతి, పలు విభాగాల డైరెక్టర్లు, హెచ్‌ఓడీలు, ప్రొఫెసర్లు, ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

## తనిఖీల్లో రూ.5.50లక్షల పట్టివేత



సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న నగదును సీజ్ చేసిన కేపీహెచ్‌బీ పోలీసులు

**కూకట్‌పల్లి:** లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సోమవారం సీఐఎస్ఎఫ్ సిబ్బందితో కేపీహెచ్‌బీ పోలీసులు వాహనాల తనిఖీలుచేపట్టారు. జేఎన్‌టీయూ నుంచి ఫోరమ్ మాల్ రోడ్డులో చేపట్టిన ఈ తనిఖీల్లో ఓ కారు (టీఎస్09యూడీ4039)ను తనిఖీ చేశారు. అందులో ముగ్గురు వ్యక్తులు ఎస్.అజయ్‌కుమార్ (24) కస్టోడియన్, జి.కృష్ణ (24) కస్టోడియన్ ఎం.సాయికిరణ్ (23) సేఫ్ గార్డ్, వ్యాన్‌డ్రైవర్, పి.కుమారస్వామి (50) గన్‌మ్యాన్‌లు సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.5,50,290ను పట్టుకున్నారు. ఈ మేరకు నగదును సీజ్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పడకేసిన ఈర్ల చెరువు పార్కు పనులు



### మేయర్ దత్తత తీసుకున్నా కానరాని అభివృద్ధి



ఈర్ల చెరువులో మురుగునీరు చేరుతున్న దృశ్యం

**హఫీజ్‌పేట్:** హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఈర్ల చెరువు పార్కు అభివృద్ధికి నోచుకోలేదు. మరో పక్క చెరువు సుందరీకరణ అంటూ నిధులు వెచ్చించినా ఫలితం లేదు. నగర మేయర్ ఈర్ల చెరువును తీసుకున్నారని అభివృద్ధి షురూ అని స్థానికులు భావించారు. ఆదిశగా పనులు జరగలేదు. ఈర్ల చెరువు పార్కు ముఖద్వారం నుంచి 200 మీటర్ల వాకింగ్ ట్రాక్ తప్ప పచ్చదనం మాత్రం కానరాదు. లక్షలాది రూపాయలు పార్కు అభివృద్ధికి కేటాయించినప్పటికి అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

- ఈర్ల చెరువు పార్కులో వాకింగ్ ట్రాక్ మాత్రం కనపడుతోంది.
- చెరువు అలుగు పనులు అసంపూర్తిగా ఉన్నాయి
- రాత్రి సమయాలలో మందుబాబులకు అడ్డాగా మారిన పార్కు.
- ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### మేయర్ దృష్టి సారించాలి



ఈర్ల పార్కుపై జీహెచ్ఎంసీ మేయర్ ప్రత్యేక దృష్టి సారించాలి. త్వరిగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. అధికారులు నిర్లక్ష్యం వహించకుండా మేయర్ ఆదేశాలు ఇవ్వాలి.

– సి.బి.రెడ్డి, మైత్రినగర్

### అసంపూర్తి పనులు పూర్తి చేయాలి



చెరువు సుందరీకరణ పనులు తక్షణమే ప్రారంభించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. అసంఘటిత కార్యకలాపాలు జరగకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

– రవి, మదీనాగూడ



ఈర్ల చెరువు పార్కు



వాకింగ్ ట్రాక్‌కు ఇరువైపులా పిచ్చి మొక్కలు



పార్కులో మద్యం సీసాలు

## 24న బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్

టెలీ కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే కృష్ణారావు



**కూకట్‌పల్లి:** మల్కాజ్‌గిరి లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ఈనెల 24వ తేదీన నామినేషన్ వేయనున్నట్లు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం నియోజకవర్గ కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. రాగిడి లక్ష్మారెడ్డి విజయానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని సూచించారు.

## ఈటల రాజేందర్ విజయానికి కృషి చేస్తాం

**ఓల్డ్‌బోయిన్‌పల్లి:** బీఆర్ఎస్ నాయకుడు, బీసీ సంఘం జాతీయ కార్యదర్శి దండుగుల అశోక్ బీజేపీ కండువా కప్పుకున్నారు. సోమవారం దండుగుల అశోక్ ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ నుంచి 50 మందితో ర్యాలీగా తరలివెళ్లి మల్కాజ్‌గిరి అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా దండుగుల అశోక్ మాట్లాడుతూ... నరేంద్రమోదీ భారతదేశాన్ని ప్రపంచ దేశాలకు దీటుగా నిలబెట్టేందుకు చేస్తున్న కృషికి ఆకర్షితులై పార్టీలోకి వచ్చానన్నారు. ఈటల రాజేందర్ విజయానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాజు, నరేష్, శివ, నాగరాజు, రంజిత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరిన దండుగుల అశోక్, నాయకులు

## నగరానికి థాయ్ చెఫ్ రాక

**సాక్షి, సిటీబ్యూరో:** తనదైన ప్రత్యేకతతో ఆసియా ప్రాంతపు వంటకాలకు అంతర్జాతీయంగా పేరొందిన థాయ్‌ల్యాండ్‌కు చెందిన లేడీ చెఫ్ సీఫా కెచాయో నగరానికి వస్తున్నారు. గచ్చిబౌలి షెరటాన్ హోటల్‌లోని జెగా రెస్టారెంట్ వేదికగా 2 రోజుల పాటు తన స్పెషల్ రుచులను నగరవాసులకు అందించనున్నారు. బ్యాంకాక్ వీధుల్లో ఏషియన్ స్ట్రీట్ ఫుడ్ నిర్వహణ ద్వారా పేరొందిన చెఫ్ కరణ్ బానెతో కలిసి సదరన్ థాయ్, క్రాబ్ కర్రీ, స్టీమ్ సీబాస్, స్పైసీ లెమన్ బ్రోత్...తదితర తన స్పెషల్ డిష్‌లను ఈ లేడీ చెఫ్ వడ్డించనున్నట్టు హోటల్ ప్రతినిధులు తెలిపారు. బుధవారం నుంచి రెండు రోజుల పాటు మాత్రమే థాయ్ చెఫ్ ఆతిథ్యంతో పాటు ఆమెతో సంభాషించే అవకాశం కూడా ఉందన్నారు.

## 'ఐఎస్‌బీ'లో టీచర్ ఆఫ్ ది ఇయర్ ఎంపిక

**రాయదుర్గం:** ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో టీచర్ ఆఫ్ ది ఇయర్‌గా పలువురు ప్రొఫెసర్లు ఎంపికయ్యారు. అందులో భాగంగా పబ్లిక్ పాలసీ విభాగంలో అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్(ఏఎంపీపీపీ) క్లాస్ ఆఫ్ 2023, అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ ఫర్ హెల్త్‌కేర్ (ఏఎంపీహెచ్) క్లాస్ 2023లో టీచర్ ఆఫ్ ది ఇయర్‌గా పలువురు ప్రొఫెసర్లను ఎంపిక చేసి వారిని సన్మానించారు. ఏఎంపీహెచ్‌క్లాస్–2023లో టీచర్ ఆఫ్ ది ఇయర్‌గా ఎంపికైన వారిలో ప్రొఫెసర్ అంజల్ ప్రకాశ్, ప్రొఫెసర్ నందు నంద కిషోర్, ప్రొఫెసర్ సారంగ్‌డియో, పీజీపీ ఎంఎఫ్ఏబీ క్లాస్–2023లో ప్రొఫెసర్ సిద్ధార్థ్ ఎస్ సింగ్ ఏఎంపీపీపీ క్లాస్–2023లో ప్రొఫెసర్ అంజల్ ప్రకాశ్, ఏఎంపీహెచ్ క్లాస్–2023లో ప్రొఫెసర్ నందు నందకిషోర్, పీజీపీ ఎంఎఫ్ఏబీ క్లాస్–2023లో ప్రొఫెసర్ షమికారవి, పీజీపీ క్లాస్–2024 కోర్ కార్సెస్‌లో ప్రొఫెసర్ సుమిత్ కున్నుమ్‌కల్, ప్రొఫెసర్ మిలింద్ సోహోని, ప్రొఫెసర్ ఎం విజయసుందర్ ఎంపికయ్యారు. వీరిని ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల, పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

## కర్ణాటక డిప్యూటీ సీఎంను కలిసిన రూబిన్‌గౌడ్



**కూకట్‌పల్లి:** తెలంగాణ బీసీ దళ్ స్టేట్ యూత్ ప్రెసిడెంట్ రూబిన్‌గౌడ్ సోమవారం కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీకే శివకుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం రూబిన్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి బీసీ దల్ రాష్ట్ర యూత్ పనిచేస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు సత్ఫలితాలను ఇస్తున్నాయని తెలిపారు.

## సునీత భారీ మెజార్టీతో గెలవటం ఖాయం



అల్లాపూర్ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న యువనేత మస్తాన్‌రెడ్డి



నామినేషన్‌కు బయల్దేరుతున్న బండి రమేష్, దండుగుల యాదగిరి

**మోతీనగర్:** మల్కాజ్‌గిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి మద్దతుగా యువ నాయకుడు దేవరింటి మస్తాన్‌రెడ్డి సోమవారం ప్రచారం నిర్వహించారు. అల్లాపూర్ డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. రేవంత్ సర్కార్ అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించారు. ప్రజల నుంచి తమకు మంచి స్పందన వస్తోందన్నారు. ఈసారి మల్కాజ్‌గిరిలో సునీతామహేందర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలవటం ఖాయమన్నారు. ఈ ప్రచారంలో డివిజన్ ప్రెసిడెంట్ మొయినుద్దీన్, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహ, ప్రధాన కార్యదర్శి కనకయ్యగౌడ్, సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రవి ముదిరాజ్, రాజారెడ్డి, ఆదినారాయణ, కృష్ణ మూర్తి, అనిల్, వేణు, సరోవర్ పాల్గొన్నారు.

### సునీత నామినేషన్‌కు తరలిన నేతలు

**ఓల్డ్‌బోయిన్‌పల్లి:** మల్కాజ్‌గిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బోయిన్‌పల్లిలోని గాంధీ భవన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి అందరూ కలిసి కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి బండి రమేష్ ఆధ్వర్యంలో బస్సుల్లో నామినేషన్ ర్యాలీకి బయల్దేరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి, కనకరాజుయాదవ్, కాసు అశోక్, దేవయ్య, జహంగీర్, గోపాల్ ముదిరాజు, సదానంద్, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌లో చేరికలు

**కూకట్‌పల్లి:** గల్లీ నుంచి ఢిల్లీ దాకా మహిళలు, యువతకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటోందని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై యువత, మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. బాలానగర్ నాయకురాలు పుష్పరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్, బీజేపీకి చెందిన కార్యకర్తలకు సోమవారం ఆయన పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పట్నం సునీతామహేందర్‌రెడ్డి తనయుడు రినిష్‌రెడ్డి, పుష్పరెడ్డి, పులి శివకుమార్‌గౌడ్, పులి శ్రీకాంత్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## కాలనీ సమస్యలను పరిష్కరిస్తా

**ఆల్విన్‌కాలనీ:** డివిజన్ పరిధిలోని ధరణినగర్ అసోషియేషన్ సభ్యులతో సోమవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలపై చర్చించారు. కాలనీలోని డ్రైనేజీ, సీసీ రోడ్ల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, సీహెచ్.భాస్కర్, రాజబాబు, సత్యనారాయణ, శ్రీదేవి, రామారావు, సత్యనారాయణ, శివకుమార్, వెంకటేశ్వరరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## నాలెడ్జి సిటీలో 'డబుల్ బుక్ లాంచ్'

**రాయదుర్గం:** హ్యాపీ ఎవల్యూషన్ వ్యవస్థాపకురాలు, రచయిత పల్లవిజవార్ రచించిన రెండు పుస్తకాలను సోమవారం నాలెడ్జి సిటీలో డబుల్ బుక్ లాంచ్ పేరిట ఆవిష్కరించారు. తల్లిదండ్రుల వద్ద సంతోషకరమైన వాతావరణం, మన జీవితంలో మంచి క్షణాలు తదితర అంశాలపై ఆమె పుస్తకం రాశారు. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో కీస్టోన్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్, వ్యవస్థాపకుడు శ్రీలక్ష్మీరెడ్డి, శ్రీరామ్ హైదరాబాద్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్, వ్యవస్థాపకురాలు సింధూరి కందుకూరి, మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ శుభావిల్లాస్, పారిశ్రామిక వేత్త అల్కాబంగర్, రచయిత అంజుపొద్దార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రచయిత పల్లవిజవార్ మాట్లాడుతూ పిల్లల పెంపకంపై ఈ పుస్తకం పలు సృజనాత్మక మార్గాలను అందిస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## ఆర్కిటెక్చర్ కళాశాలలో ధరణీ దినోత్సవం

**మాదాపూర్:** ధరణి దినోత్సవాన్ని పురస్కరించుకుని మాదాపూర్‌లోని శ్రీ వేంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కళాశాలలో కెనడియన్ వుడ్ సహకారంతో డిజైన్ కాంపిటీషన్‌ను నిర్వహించారు. నగరంలోని వివిధ కళాశాలల విద్యార్థులు తమ నమూనాలను ప్రదర్శించారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, డైరెక్టర్ ఎస్. అజితా శేఖర్, కళాశాల ప్రిన్సిపల్ కామినిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి

**హిమాయత్‌నగర్:** యువత నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని బిలియన్ మ్యాన్, కేఎంపీఎస్ సంస్థ వ్యవస్థాపకుడు కుంట శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మన దేశం ఆధ్యాత్మిక ప్రపంచం, వ్యాపార ప్రపంచం, సేవారంగ ప్రపంచం అనే ట్రైయాంగిల్ ప్రపంచం దిశగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం తమ సంస్థ ఆధ్వర్యంలో సీఈఓ ఇండియా పేరుతో జాతీయ స్థాయి కార్యక్రమాన్ని రూపొందించనున్నట్లు ఆయన వెల్లడించారు. యువతకు ఆధ్యాత్మిక సంపదను అందించాలని, ఐటీ, బీపీవోలతో పాటు వ్యాపార రంగాలలో మరింత అభివృద్ధి చెందాలని అందుకోసం తాము చేపట్టనున్న సీఈఓ ఇండియా అనే కార్యక్రమాన్ని ఎన్ఆర్ఐలతో పాటు పలువురు ప్రముఖుల సహకారంతో చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా వంద బృందాలతో రానున్న రోజుల్లో ఈ కార్యక్రమాన్ని దేశంలోని అన్ని జిల్లా కేంద్రాలలో నిర్వహించేందుకు కృషిచేస్తామని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

## 'బ్లూ కాలర్ జాబ్స్'కు ఉజ్వల భవిష్యత్

**సాక్షి, సిటీబ్యూరో:** రానున్న రోజుల్లో ఆఫీసుల్లో కాక బయట చేసే బ్లూ కాలర్ ఉద్యోగాలకు ఉజ్వల భవిష్యత్తు ఉందని నిపుణులు అభిప్రాయపడ్డారు. బ్లూ కాలర్ రిక్రూట్‌మెంట్‌కు పేరొందిన వాహన్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లోని ఇన్నోవీవీ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ప్రాంగణంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జాబ్ మార్కెట్ నిపుణులు మాట్లాడుతూ... ఫుడ్ డెలివరీ, క్విక్ సర్వీస్, ఇ–కామర్స్.. విజృంభణ నేపథ్యంలో నీతి అయోగ్ అంచనా ప్రకారం.. ఈ రంగంలో 2030 కల్లా 2.35 కోట్ల ఉద్యోగులు ఉంటారన్నారు. నిర్వాహక సంస్థ సహలై హెడ్ సిద్ధార్థ్ చౌహాన్ మాట్లాడుతూ... జొమాటో, స్విగ్గీ, అమెజాన్ తదితర భాగస్వాములతో కలిసి గత ఏడాది 1.64 లక్షల మందికి బ్లూ కాలర్ ఉద్యోగాలు కల్పించినట్టు తెలిపారు.

## ఆర్ఎంపీ వైద్యులపై దాడులు ఆపాలి

**పంజగుట్ట:** రాష్ట్రంలో పనిచేస్తున్న గ్రామీణ వైద్యుల వృత్తికి.. జీవనానికి భరోసా లేకుండా పోతున్నదని తెలంగాణ గ్రామీణ వైద్యుల సంఘం నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. 24 గంటలు కష్టపడి స్థానిక ప్రజలకు తక్కువ ఖర్చుతో సేవలు ఇస్తుంటే కార్పొరేట్ శక్తులు అణచివేతకు గురిచేస్తున్నాయని సంఘం ప్రతినిధులు ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు శ్రీనివాస్‌రాజు, అఖిల్ శాస్త్రీ, ఎం.ఎ.రహమాన్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకురుల సమావేశంలో వారు మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో తాము వైద్య సేవలు అందిస్తుంటే కార్పొరేట్ శక్తులు వైద్యశాఖ అధికారులపై ఒత్తిడి తెచ్చి తమ క్లినిక్‌లపై దాడులు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫస్ట్ ఎయిడ్ మాత్రమే చెయ్యమంటారు, కనీసం సెలైన్ పెట్టే స్టాండ్‌కూడా పెట్టనివ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహానేత, దివంగత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి ఉన్న సమయంలో తమకు శిక్షణ ఇప్పించి తమను అన్నివిధాలా ఆదుకున్నారని గుర్తుచేశారు. తిరిగి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తమను ఆదుకుంటుందని భావిస్తున్నామని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మరో లక్ష మంది వైద్యులను నియమించినా గ్రామాల్లో వారు వైద్యం చేసే అవకాశం ఉండదన్నారు. కార్యక్రమంలో నేతలు యాదగిరి, రాజేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌టీజేపీ మేనిఫెస్టో విడుదల

**పంజగుట్ట:** రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో అన్ని స్థానాల్లో లోక్‌తాంత్రిక్ జనతాదళ్ పార్టీ అభ్యర్థులు బరిలో ఉంటారని ఆ పార్టీ తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు రత్నం బూరగ, జాతీయ అధ్యక్షుడు జావేద్ రాజ్‌లు తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పార్టీ మేనిఫెస్టోను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఓటర్లను యజమానులుగా చెయ్యడమే తమ లక్ష్యమన్నారు. నాయకులను, పార్టీలను, అధికారులను జీతగాళ్లలా సేవ చేయిస్తామని తెలిపారు. దేశం మొత్తం సమసమాజం రూపొందిస్తామన్నారు. ఉచిత విద్య, వైద్యం అందించి పేదరికం లేకుండా చేస్తామని, రైతులను రాజులను చేస్తామని తెలిపారు. తమ పార్టీ దేశంలో 273 స్థానాలు మహిళలకు, బీసీలకు కేటాయించామని, అన్ని ప్రాంతాల్లో సగానికి పైగా వారికే కేటాయిస్తున్నామన్నారు. యువ ఓటర్లను చైతన్యవంతం చేసి వారు ఓటు వేసేలా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నేతలు చలం, విజయకుమారి పాల్గొన్నారు.

## సజావుగా సగర మహాసభ ఎన్నికలు

**హిమాయత్‌నగర్:** అఖిల భారత సగర మహాసభ జంట నగరాల శాఖ ఎన్నికలు పారదర్శకంగా ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారని మహాసభ అధ్యక్షుడు ముత్యాల హరికిషన్ సాగర్ తెలిపారు. సోమవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అఖిల భారత సగర మహాసభ జంట నగరాల శాఖ నూతన కార్యవర్గ సభ్యులు కొండల అనిల్ కుమార్ సాగర్, కమటం వేణుగోపాల్ సాగర్, శ్రీధర్, జగన్మోహన్‌రావు, రాజశేఖర్ రావు పాల్గొన్నారు.